





ట్రైబల్ వర్సిటీతో నూతన అధ్యాయం

- విద్యారంగంలో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- గిరిజన యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరైన ఎంపీలు బలరాంనాయక్, నగేష్


శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎంపీలు

7



లంబాడీలది కష్టపడే జాతి

ఆత్మగౌరవ సభలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ 8

నేడు సద్దుల సంబురం

- జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు
- మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లు
- పల్లెల్లో చెరువుల వద్ద ఆటపాటలు


మహబూబాబాద్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించే ఎన్టీఆర్ స్టేడియం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబురాలను సోమవారం వైభవంగా జరుపుకోనున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ నిర్వహణకు ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30న సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ, వేదపండితుల సూచనల మేరకు తొమ్మిదో రోజు సోమవారం బతుకమ్మ ఆడిన తర్వాత నిమజ్జనం చేసేందుకు ప్రజలు, యువజన సంఘాలు ఏర్పాట్లు చేశాయి. దీనికనుగుణంగా అధికారులు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంతో పాటు మునిసిపాలిటీలు,అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో

(మిగతా 8లో..)











భక్తితోనే ముక్తి

● ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భక్తితోనే ప్రతీ ఒక్కరికి ముక్తి లభిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మరిపెడ మండల్ పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతక ప్రత్యేక పూజలు చేసి అక్కడి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. దేవీశర్నవరాత్రులలో భాగంగా అమ్మవారికి నిష్ఠతో పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులకు అపారనమ్మకమన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, విసారపు శ్రీపాల్‌రెడ్డి, అంబరీశ, రాంలాల్, భిక్షపతి, గుండగాని వెంకన్న, టీవీ రావు, అల్వాల ఉపేందర్, బోనగిరి సత్యనారాయణ, దిలీప్, గర్రపల్లి శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను అభినందించిన పాఠశాల యాజమాన్యం



లోకేశ్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

తొర్రూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్ సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించిన ధర్మారపు లోకేశ్‌ను ఆదివారం తొర్రూరు లిటిల్ ఫ్లవర్ పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ హనుమాండ్ల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలే కాక పట్టణ ప్రాంతంలో చదివిన విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తయారుచేయడమే మా పాఠశాల లక్ష్యమని తెలిపారు. పాఠశాలలో పదవ తరగతి చదివి ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులను అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించిన ధర్మారపు లోకేశ్‌కు ఆర్థికసాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు నాగిరెడ్డి, సంపత్, ప్రకాశ్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, మురళీకృష్ణ, నాగయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

● స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా రావణవధ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరులోని పెద్ద చెరువు వద్ద బతుకమ్మ సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, పారిశుధ్య పనులు, తాగునీటి వసతి, మైదానం మొత్తం చదను చేయాలని ఆదేశించారు. తెలంగాణ జీవన సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగ అని, తెలంగాణ ఆత్మ గౌరవం ఉద్యమ చిహ్నం బతుకమ్మ అన్నారు. అనంతరం యతిరాజారావు పార్కులో నిర్వహించే రావణవధ ఏర్పాట్లను సమీక్షించారు. రావణవధ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని, తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే పండుగ దసరా పండుగ అని, ఈ పండుగకు చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకుంటారన్నారు. పండుగ ఏర్పాట్లు వైభవంగా చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం రావద్దని, అవాంచనీయ సంఘటనలు రాకుండా పోలీసు బందోబస్తు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, బాపురెడ్డి, విజయ్‌పాల్ రెడ్డి, శ్రావణ్, సురేశ్, రాజేశ్ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

మరిపెడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):డిగ్రీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మరిపెడబంగ్లాలోని కనుకదుర్గ మినీ ఫంక్షన్‌హాల్ అపూర్వంగా జరుపుకున్నారు. 2012-2014 బ్యాచ్‌కు చెందిన ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ పూర్వ విద్యార్థులు గత 13ఏళ్ల కిందట కళాశాలను వదిలి వెళ్లి ఈ రోజు మళ్లీ కలుసుకోవడంతో వారిలో పట్టలేని సంతోషం అలుముకుంది. డిగ్రీ చదివే సమయంలోని వారి తీపి, చేదు జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒక్కరికి ఒకరు తమ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఆధ్యాపకులు చలపతిరావు, దేవేందర్‌రెడ్డి, సంధ్యారాణి, శంకర్, శ్రీనివాస్, తులసీ దాస్, కవిరాజ్, లక్ష్మణ్ తదితరులకు మెమెంటోలను అందచేసి సత్కరించారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావులను కలిసిన మాజీ మంత్రి రెడ్యానాయక్



కేటీఆర్‌కు బొకె అందజేస్తున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

మరిపెడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు లను ఆదివారం హైదరాబాద్‌లో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ మర్యాద పూర్వ కంగా కలుసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికలపై చర్చించారు. డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని జడ్పీటీసీలు, ఎంపీపీలను కైవసం చేసుకోవాలని రెడ్యానాయక్‌కు వారు సూచించారు. రెడ్యా నాయక్ వెంట మరిపెడ మండల మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎమ్డీ.అయూబ్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా రాజేందర్



కొమ్ము రాజేందర్

కేసముద్రం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ -2025' పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, డాక్టర్ పింగిళి రమేష్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డిలు ఆదివారం ప్రకటించారు. అసోం రాష్ట్రం గౌహతిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో వచ్చే నెల 6 నుంచి 19వ తేదీ వరకు భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నట్లు వారు తెలిపారు. గతంలో రాజేందర్ రెండుసార్లు ప్రపంచ స్థాయి ఒలంపిక్స్‌తోపాటు పలు అంతర్జాతీయ పోటీల్లో అంపైర్‌గా వ్యవహరించారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మండల కేంద్రంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు అనపురం లక్ష్మీనారాయణ, దుర్శోజు స్వరూప మరణించగా, మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం మృతుల కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ పరామర్శలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచంద్రశర్మ, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, శ్రీరాం రాము, విశ్వానాధుల జ్ఞానేశ్వరాచారి, నారాయణ, భిక్షపతి, సతీష్, మహేష్, విజయ, యాకయ్య, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

కవి, రచయిత పరమేశ్వర్‌కు కీర్తి రత్న పురస్కారం



పరమేశ్వర్‌కు కీర్తి రత్న పురస్కారం అందిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

పెద్దవంగర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి బిర్రు పరమేశ్వర్ జాతీయ స్థాయిలో కీర్తి రత్న పురస్కారాన్ని అదివారం అందుకున్నారు. గత కొంతకాలంగా పరమేశ్వర్ సాహిత్య, సంస్కృతికతోపాటు సామాజిక సేవ అంశాలపై అనేక కవితాగానం చేస్తున్నారు. సాహిత్య రంగంలో చేస్తున్న విశేషమైన కృషిని గుర్తించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక సౌజన్యంతో భవాని సాహిత్య వేదిక కరీంనగర్ వారు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో బిర్రు పరమేశ్వర్‌కు కీర్తి రత్న పురస్కారం, శాలువాతో సన్మానించి ప్రశంసా ప్రతంతో పాటు జ్ఞాపికను అందజేశారు. బిర్రు పరమేశ్వర్ పలు వేదికలపై సామాజిక అంశాలపై తన కవిత గానంతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు.

బతుకమ్మ పండుగకు రండి



మంత్రి సీతక్కకు ఆహ్వానం పలుకుతున్న నారాయణరెడ్డి

కొత్తగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రతీక అయిన బతుకమ్మ పండుగకు మండలంలోని సాధిరెడ్డిపల్లి గ్రామానికి రావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్‌ఎమెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి ఆహ్వానం అందజేశారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం మంత్రి సీతక్కను నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. సీతక్కకు చల్లా నారాయణరెడ్డి నూతన వస్త్రాలు అందించారు. గ్రామంలో నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాలకు రావాలని మంత్రిని కోరారు.

నేటి ఎన్నికల శిక్షణను వాయిదా వేయాలి

డీపీవో హరిప్రసాద్‌కు పీఆర్టీయూ-టీఎస్ వినతి



డీపీవో హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఏఐఎఫ్‌టీవో ఉపాధ్యక్షులు గీత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ఉండడంతో ఉపాధ్యాయులు సొంత గ్రామాలకు వెళ్లారని, ఈనెల 29న నిర్వహించనున్న ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను దసరా సెలవుల తర్వాతకు వాయిదా వేయాలని పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సతీష్‌రెడ్డి, ఏఐఎఫ్‌టీవో ఉపాధ్యక్షురాలు నూకల గీత విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) హరిప్రసాద్‌ను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల గురించి అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో అనేక మంది ఉపాధ్యాయులు స్వగ్రామాలకు వెళ్లారని తెలిపారు. దసరా సెలవుల అనంతరం ఉపాధ్యాయులకు స్థానిక ఎన్నికలకు సంబంధించిన శిక్షణను ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో కూడా ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను రీషెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గునిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దసరా సెలవుల తర్వాత శిక్షణ ఇవ్వాలి..

దసరా సెలవులు ఉండడంతో ఉపాధ్యాయులు స్వగ్రామాలకు వెళ్లారని, అక్టోబరు 6 తర్వాత ఎన్నికల శిక్షణ వేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలాష్టి రమేష్, పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇబ్బంది లేని సమయంలో శిక్షణ ఇస్తేనే ఎన్నికలు సజావుగా నిర్వహించబడుతాయని తెలిపారు. ఎన్నికల శిక్షణను అక్టోబరు 6 నుంచి రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే షెడ్యూల్ ప్రకారం ఎన్నికల శిక్షణ కొనసాగిస్తే హాజరు కాని ఉపాధ్యాయులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను అక్టోబరు 10కి వాయిదా వేసినట్లు వివిధ ప్రసార మాధ్యమాల్లో వస్తుందని, జిల్లాలో కూడా వాయిదా వేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు జాషువా కృషి



మహబూబాబాద్‌లో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఐక్యవేదిక బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ నిర్మూలనకు నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా కృషి చేశారని జిల్లా విద్యాశాఖ ఆర్థిక కార్యదర్శి శంకర్‌నాయక్, గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చిరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా 130వ జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాటి సామాజిక వ్యవస్థ మూలాలను, అమానవీయ వర్ణ వ్యవస్థను ప్రతిఘటిస్తూ, సాహిత్య వేదికపై మానవ జాతిని మేల్కొల్పిన గొప్ప సంఘ సంస్కర్త, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దాసరి మహేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్, బాలాజీ, జలగం వీరస్వామి, శ్రీనివాస్, బిచ్చనాయక్, కిషన్‌నాయక్, హోంజీ, లింగానాయక్, రవీందర్, మంగీలాల్, తపస్ జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ పాల్గొన్నారు.


డోర్నకల్‌లో పవర్ లిఫ్టింగ్ పోటీలు



పవర్‌వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారుడు

డోర్నకల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో ఆదివారం జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు స్థానిక మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. పోటీలను కాంగ్రెస్ నాయకులు నూకల అభినవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అభినవ్‌రెడ్డి మాట్లాడుతూ.. పవర్ వెయిట్ లిఫ్టింగ్ వల్ల క్రీడాకారులు శారీరక, మానసికంగా దృఢత్వం పెంపొందుతుందన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సైతం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి మాజీ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు రామకోటేశ్వర్‌రావు, బుట్టి అశోక్‌కుమార్, మారబోయిన లక్ష్మీనారాయణ, ప్రముఖ వ్యాపారి మహేందర్‌కుమార్ జైన్, దేవాసింగ్ పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ ప్రజావేదిక



కురవి ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు

కురవి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో తప్పులు చేసిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన్‌రాజు తీవ్రంగా హెచ్చరించారు. 2024-25లో జరిగిన ఉపాధి హామీ పనులపై 15 రోజుల పాటు సామాజిక తనిఖీని నిర్వహించి ఆదివారం కురవి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ పనుల్లో అనేక అవకతవకలకు పాల్పడిన సీరోలు ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్యపై చర్యలు తీసుకోవాలని మధుసూదన్‌రాజు ఆదేశించారు. ఉపాధి హామీలో నాటిన మొక్కలు 85 శాతం బతికేలా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరబాబు, ఎస్టీఎం సత్యం, ఎస్ఆర్‌పీ మహేశ్వర్, అంబుడ్స్‌మెన్, ఆదాము, ఏపీవో మనోహర్‌రెడ్డి, యాకాంబ్రం, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలి



కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రావు

డోర్నకల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. ప్రపంచ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం డోర్నకల్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కుక్కలు, పిల్లులు, ఇతర పెంపుడు జంతువులకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంపుడు జంతువులు కరిచినప్పుడు లేదా వేళ్ల గోర్లతో రక్కినప్పుడు ఎవరు కూడా నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ర్యాబిస్ వ్యాధి నివారణ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కమల్‌పాషా, సులేమాన్‌లు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..

లేఖలు లేకున్నా.. జ్ఞాపకాలెన్నో...



కేసముద్రం విలేజిలో మూగబోయిన పోస్టుబాక్సు

కేసముద్రం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాచార సాంకేతిక అభివృద్ధి చెందిన తర్వాత ప్రపంచంలో ఏ మూలన ఏం జరిగినా క్షణాల్లో మన వద్దకు ఫొటోలు, వీడియోలతో సహ చేరిపోతున్నాయి. సమాచార వ్యవస్థలో సాంకేతికతతో పూర్తిగా కనుమరుగైన వాటిలో ఉత్తరాలు కూడా ఉన్నాయి. మూడు దశాబ్దాల క్రితం సమాచారాన్ని చేరవేయాలంటే ఉత్తరాలపైనే ఆధారపడే వారు. పోస్టు డబ్బాలో ఉత్తరం వేయడం, అది గమ్యానికి చేరి తిరుగు టపాను పోస్టుమన్ ఇంటికి తీసుకువచ్చి ఇవ్వడం అనేది అప్పట్లో సాధారణంగా జరిగేది. గ్రామంలో మూడు, నాలుగు చోట్ల ఈ పోస్టు బాక్సులను ఏర్పాటు చేసేవారు. ఈ క్రమంలో కేసముద్రం విలేజిలో ఓ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన కనుమరుగైన పోస్టుబాక్సును చూసిన వారికి మూడు, నాలుగు దశాబ్దాలు వెనుకకు తీసుకువెళ్లి అప్పటి అనుబంధాల జ్ఞాపకాలను గుర్తుకు తెస్తున్నాయి. కాలగర్భంలో కలిసిపోతూ చివరి దశలోను ఇలా కనిపిస్తూ అప్పటి తరం వారికి కనువిందు చేస్తూ ఎన్నో మధుర స్మృతులను తట్టిలేపుతోంది.

సద్దులకు సర్వం సిద్ధం


- బతుకమ్మ పర్వానికి ఏర్పాట్లు పూర్తి
- తొమ్మిది రోజుల సందడికి నేడు పతాక
- కూడళ్లలో జోరుగా పూల విక్రయాలు



హనుమకొండ చౌరస్తాలో పూలు కొనుగోలు చేస్తున్న చిత్రాలు

వరంగల్ చౌరస్తాలో పండుగ కొనుగోళ్లతో రద్దీగా మారిన దృశ్యం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పూలను దైవాలుగా కొలిచే అపూర్వ సంస్కృతి మరోసారి ఆవిష్కృతం కానుంది. అమవాస్య బతుకమ్మ ప్రారంభమైన వేడుకల్లో ప్రధానమైన ఘట్టం సద్దుల బతుకమ్మకు సోమవారం సిద్ధమయ్యారు. గౌరమ్మను కొలువుదీర్చిన అందమైన బతుకమ్మలను చేబూని యావత్ మహిళా లోకం వయోబేధం లేకుండా చెరువులు, తటకాల వద్దకు చేరుకునే అపూర్వ దృశ్యాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఆవిష్కృతమై కనువిందు చేయనున్నాయి. తెలంగాణ సంస్కృతికే తలమానికమై నిలిచి తొమ్మిది రోజులపాటు ఆటపాటలతో సాగిన బతుకమ్మల వేడుక సోమవారం జరిగే సద్దులతో సద్దుమణగనున్నాయి. బతుకును ఒక పండగా, బతుకును ఒక జాతరగా కొలిచే అద్భుత సంస్కృతి తెలంగాణ ప్రజల సొంతం. అందునా ప్రత్యేకించి వరంగల్ ప్రజలు బతుకమ్మ పర్వాన్ని ఆడంబరంగా సంప్రదాయంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంస్కృతి. ప్రజలంతా దైవాన్ని పూవులతో కొలిస్తే పూవులను దేవతలుగా కొలిచే ఆచారం ప్రకృతి పట్ల అత్యంత గౌరవాన్ని చాటే పర్వం ఏదైనా ఉందంటే అది బతుకమ్మ పర్వానికే చెందింది.


విద్యుత్ వెలుగుల్లో పద్మాక్షి దేవాలయ గుండం

గౌరమ్మను ప్రతిష్ఠించి

గ్రామీణ ప్రాంతాలతో సహా జిల్లా అంతటా సద్దుల పర్వదిన వేళ మహిళల చీరెల తళుకు బెలుకులతో సప్తవర్ణ శోభాయమానం కానుంది. మహిళలంతా పోటీలుపడి పెద్ద పెద్ద బతుకమ్మలను అందం గా పేర్చడం సద్దుల బతుకమ్మ ప్రత్యేకత. బతుకమ్మలపైన పసుపుతో తయారు చేసిన గౌరమ్మను ప్రతిష్ఠించి చెరువుగట్ల వద్దకు చేరుకొని ఆటపాటలతో నీరాజనాలు అందించనున్నా రు. తమకు కష్టాలను దూరం చేసి సుఖశాంతులు ఇవ్వాలని కోరుతూ బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇంట్లో తయారు చేసుకొచ్చిన తొమ్మిది రకాల సద్దులు (వంటకాలు)ఒకరికొకరు వాయనాలు అందించుకుంటూ పంచుకుంటారు. పాటలు పాడుకుంటూ మధ్య మధ్యలో సద్దుల వేళ కలిచిన చిన్ననాటి నేస్తాలతో దాపరికాలు లేకుండా ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ ఆటలాడుకునే అపు రూప పర్వం సద్దుల వేళను యావత్ మహి ళాలోకం ఆత్మీయంగా స్వాగిస్తుంది. హనుమ కొండలోని పద్మాక్షి ఆలయ ప్రాంగణానికి నగరంలోని యావత్ మహిళా లోకం చేరుకో నుంది. ఈ సందర్భంగాజిల్లా యంత్రాంగం 30కి బదులు నేడే ఏర్పాట్లను చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

పూలవనం

హనుమకొండ, వరంగల్ చౌరస్తాలోని ప్రధాన వ్యాపార కూడళ్లలో గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన తంగేడు, గునుగు పూలు సందడి చేస్తున్నాయి. వీటి అమ్మకాలతో చౌరస్తాలో కిటకిటలాడుతున్నాయి. చామంతి, గులాబీలాంటి వాటికి రెక్కలొచ్చి అదనపు ధర పలుకుతున్నాయి.

బతుకమ్మ అలంకరణ

బతుకమ్మ పర్వంలో ప్రధాన ఘట్టమైన బతుకమ్మను ముత్తైదువలు ప్రత్యేక శ్రద్ధతో పేర్చుతారు. గతంలో వెదురు సిబ్బిలో పేర్చే బతుకమ్మలను ఈ రోజుల్లో పెద్ద స్టీల్ ప్లేట్స్ తంబాలంలో పేరుస్తున్నారు. మొదటి వరుస గుండ్రంగా తంగేడు పూలతో, రంగురంగుల తీరొక్క పూలతో ఆకర్షణీయంగా పేర్చుతారు. బతుకమ్మను పేర్చిన అనంతరం ప్రతీ ఇంటిలోని దేవుడి గదిలో ప్రత్యేకంగా రంగవల్లులు తీర్చిదిద్ది దానిపై నిలిచి గౌరమ్మను నిలుపుతారు. ప్రతీ ఇంటా తల్లి, పిల్లా పేరిట రెండు బతుకమ్మలను పేర్చడం ఆనవాయితీ. తల్లి బతుకమ్మ పైభాగాన గౌరమ్మను ఉంచి అగర్‌బత్తులను వెలిగించి సుగంధ పరిమళాలతో మంగళవాయిద్యాల నడుమ ఒక్కోవాడ మహిళలు జట్లు జట్లుగా చెరువుల వద్దకు కబుర్లు చెప్పుకుంటూ బతుకమ్మను తీసుకెళ్లడం సనాతన సాంప్రదాయంగా వస్తుంది. బతుకమ్మలను తీసుకెళ్లేందుకు కొత్త బట్టలు, బంగారు ఆభరణాలు ధరించి మహిళలు అట్టహాసంగా వేడుకల్లో పాల్గొంటూ సందడి చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

- మేయర్ గుండు సుధారాణి
- పలు చెరువుల వద్ద ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగే సద్దుల బతుకమ్మ స్థలాల వద్ద బల్దియా అధికారులు ఏర్పాటు పూర్తి చేశారని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను ఆదివారం గ్రేటర్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తోపాటు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువు, శివనగర్ బతుకమ్మకుంట, మెట్టు దర్వాజ, మంగళమ్మకుంట, మామునూరు పెద్దచెరువు, రంగశాయిపేట బెస్తం చెరువు, దూపకుంట ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. చెరువులలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి మైదానాలను శుభ్రం చేశామన్నారు. గుంతలలో డస్ట్ చల్లించామని చెప్పారు. ఈ ప్రాంతాలలో ఉన్న బతుకమ్మ విగ్రహాలకు రంగులు వేయించామన్నారు. ఇంకా మిగిలి ఉన్న పద్మానగర్, శాంతినగర్‌లలో పనులు జరుగుతున్నాయన్నారు. ఇంకా అన్ని చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్‌జోషి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుధారాణి


మీడియా సమావేశంలో పాల్గొన్న అర్చకులు, పురోహితులు

నేడే సద్దుల బతుకమ్మ పండుగ

- స్పష్టతనిచ్చిన అర్చకులు, పురోహితులు
- బ్రాహ్మణ భవన్ సమావేశంలో వెల్లడి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో ప్రధానంగా వరంగల్ జిల్లా వాసులకు ప్రామాణికంగా నిలిచే సద్దుల బతుకమ్మను తొమ్మిదో రోజు అయిన సోమవారమే జరుపుకోవాలని అర్చకులు, పురోహితులు, జ్యోతిష్య పండితులు ఆదివారం ముక్తకంఠంతో స్పష్టతనిచ్చారు. హనుమకొండ బ్రాహ్మణ భవన్‌లో వారు సమావేశమయ్యారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పురోహితుల సంఘం అధ్యక్షుడు తాండ్ర నాగేంద్రశర్మ మాట్లాడుతూ.. బతుకమ్మ పండగ మహిళల పండగ అని, తరతరాలుగా తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణ ప్రజలకు ఎంతో అపురూపమైన తొమ్మిది రోజుల పర్వమని చెప్పారు. ఈ పండగ విషయం ఏ పురాణాల్లో కానీ శాస్త్రాల్లో గాని పేర్కొనలేదని, ఇది కేవలం తెలంగాణ ఆడపడుచుల పూల జాతర పర్వమని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపుకునే దసరా నవరాత్రులకు, బతుకమ్మకు పోలిక పెట్టకూడదన్నారు. ఒక గ్రామీణ ప్రాంతంలోని ఏ మహిళను కదిలించినా ఏ రోజు సద్దుల బతుకమ్మ.. అని అడిగితే తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ పేర్చుకొని నిమజ్జనం చేస్తామని చెబుతుందని వివరించారు. అంతేకానీ దీనికి చరిత్రకారులు, పండితులు, జ్యోతిష్య సామ్రాట్‌లు, విద్వత్ సభలు పెట్టి చెప్పాల్సిన ఆగత్యం లేదని పేర్కొన్నారు. బతుకమ్మ విషయంలో భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషుతో కూడా మాట్లాడినట్లు నాగేంద్రశర్మ చెప్పారు.

తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 30వ తేదీన సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఇచ్చిన ఉత్తర్వులను మార్చాలని కోరారు. 29వ తేదీ సోమవారమే సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఆడపడుచుల ప్రాంతీయ ఆచారం బతుకమ్మ పర్వమని, వాళ్లు నిర్ణయించినప్పుడే సద్దులు జరుగుతాయన్నారు. వరంగల్, హనుమకొండ చౌరస్తాలో ఆదివారం ఉదయమే క్వింటాళ్ల కొద్ది రకరకాల పూలు అమ్మకానికి చేరుకున్నాయని, దీంతో సోమవారమే సద్దులు అన్న విషయం తెలిసిపోతుందని ఆయన పేర్కొన్నారు. సద్దుల విషయంలో ఎలాంటి బేషజాలకు తావులేదన్నారు. మరో జ్యోతిష్య పండితులు చెరుకుపల్లి శ్రీనివాసాచార్య మాట్లాడుతూ.. పెత్రమాస నుంచి తొమ్మిది రోజులు బతుకమ్మ ఆడటం పూర్వీకుల ఆచారమని, శాస్త్రాల అధ్యయనం జోలికి వెళ్లాల్సిన పనిలేదని, సోమవారం మహిళలు బతుకమ్మలను పేర్చి గంగమ్మ చెంతకు నిమజ్జనానికి తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. వరంగల్‌లోని రాజరాజేశ్వర దేవాలయం ప్రధాన అర్చకుడు ఎల్లంబట్ల లక్ష్మణ్‌శర్మ మాట్లాడుతూ.. సూర్యచంద్రులను ఆరాధించే హిందూ సంస్కృతిలో పండుగల విషయంలో తేడాలు రావడం దురదృష్టకరమని అన్నారు. సోమవారమే సద్దుల పర్వాన్ని నిర్వహించుకుందామన్నారు. ఐనవోలు ఆలయ అర్చకుడు మధుకర్‌శర్మ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎవరితో సంబంధం లేకుండా సోమవారం సద్దుల బతుకమ్మను జరుపుకునేందుకు సమాయత్తం అయ్యారన్నారు.

ఇంకా రామలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు తనుగుల రత్నాకర్, ఆకారపు విశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకులు లంకా శివకుమార్, చిన్న కోవెల సీతారామచంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకుపల్లి నర్సింహాచార్యులు, పెద్ద కోవెల నుంచి నర్సింహాచార్యులు, రాష్ట్ర శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు తిరువరంగం ప్రభాకర్‌జీ, జీవీఎస్.శ్రీనివాసాచార్య, అనేక మంది అర్చకులు, వేది పండితులు కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ట్రైబల్ వర్సిటీతో నూతన అధ్యాయం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- ములుగులో గిరిజన యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



ట్రైబల్ యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు విద్యారంగంలో నూతన అధ్యాయాన్ని సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన యూనివర్సిటీ ప్రహరీ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీలు పోరిక బలరాంనాయక్, జి.నగేష్, కలెక్టర్ దివాకర, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్‌తో కలిసి మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉన్నత విద్యావకాశాలు అందుతాయన్నారు. గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభన వెలికి తీసేందుకు ఇది బలమైన వేదిక అవుతుందన్నారు. గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక సౌకర్యాలను సమకూర్చుతామన్నారు. విద్యార్థుల కోసం ఆధునిక లైబ్రరీలు, ల్యాబోరేటరీలు, హాస్టల్, తరగతి గదులను నిర్మాణాలను చేపట్టినట్టు తెలిపారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్యకోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

స్థానికులకు 80 శాతం ప్రవేశాలు

ట్రైబల్ యూనివర్సిటీలో 80 శాతం స్థానిక విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. ఈ యూనివర్సిటీ ద్వారా యువత సుస్థిర భవిష్యత్‌కు పునాది వేసినట్లవుతుందన్నారు. సమాజానికి, జిల్లా అభివృద్ధికి, గిరిజన సంక్షేమానికి ఈ విశ్వవిద్యాలయం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

రూ.24 కోట్లతో ప్రహరీ నిర్మాణం

ట్రైబల్ యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.24 కోట్లు కేటాయించిందని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ తెలిపారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో యూనివర్సిటీ నిర్మాణం పూర్తవుతుందన్నారు. గిరిజనుల విద్యాభివృద్ధి, వారి సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికి చాటేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ ప్రాంతానికి సెంట్రల్ గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. సమ్మక్క-సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీలో రాబోయే ఐదేళ్లలో 3వేల నుంచి 5వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 42 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు.

భవానీ అలంకరణలో భద్రకాళి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఏడో రోజు ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం, చతుష్టానార్చన దుర్గార్చన పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భవాని మాతగా అమ్మవారిని అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తికి రథోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, భువనగిరి కలెక్టర్ హన్మంతరావు దంపతులు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఈవో రామల సునిత, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్, ఓరుగంటి పూర్ణచందర్, అనంతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు


భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

తల్లీ.. సల్లంగ సూడు..

- భద్రకాళి ఆలయంలో మంత్రి కొండా సురేఖ మొక్కులు
- కళాకారులకు ప్రశంసాపత్రాల అందజేత


భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. తల్లీ.. సల్లంగ సూడు.. అంటూ వేడుకున్నారు. అంతకుముందు ఆమెకు ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు, ప్రధానార్చకులు, ఈవోలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్తపన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలతోపాటు కాంగ్రెస్ నాయకులు గోపాల్‌నవీన్‌రాజ్, మీసాల ప్రకాశ్, అనంతుల శ్రీనివాసరావు, మూగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

- బీఆర్ఎస్ హనుమకొండ కార్యాలయంలో నిర్వహణ
- హాజరైన పద్మా దేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, సత్యవతి రాథోడ్


బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాయంలో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, డిప్యూటీ మాజీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ జడ్పీ చైర్మన్ తులఉమ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో తరలి వచ్చి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం సత్యవతి రా థోడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బతుకమ్మ పండుగను గొప్పగా నిర్వహించారని అన్నారు. కేసీఆర్ మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసి గౌరవించారని అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని రైతులు, అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదికి వస్తున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, వినయ్ భాస్కర్ సతీమణి దాస్యం రేవతి, జీపీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రేణుక, జోరిక రమేష్, వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

- దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ
- ఖిలా వరంగల్‌లో అంబరాన్నంటిన వేడుకలు


అంగన్‌వాడీ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల వద్ద మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఖిలావరంగల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ అని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఖిలావరంగల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలందరూ ఒక చోట చేరి చప్పట్లతో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం బతుకమ్మ వేడుకలను చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బతుకమ్మ అనేది కేవలం పూలపండుగ కాదని, ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ అని.. ప్రకృతిని పూజించే వేడుక అని.. భూదేవికి సమర్పించే నైవేద్యమని వర్ణించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నేటి యువత కొనసాగించాలన్నారు. డీజేలతో సంస్కృతిని నాశనం చేయకుండా ముందు తరాలకు బతుకమ్మ పండుగ విశేషాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి పూలతో పాటు కూరగాయలతో పేర్చిన బతుకమ్మలను ఎత్తుకున్నారు. అనంతరం ఆమెను శాలువా, బోకేతో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, వరంగల్ ఏసీపీ శుభం ప్రకాశ్, కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదరయాదవ్, పోశాల పద్మ, పల్లం పద్మ, ముష్కమళ్ల అరుణ, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, కత్తెరశాల వేణు, స్వయంభూ-శంభులింగేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ బంగారి శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాశ్, బెడిద వీర న్న, సంగరబోయిన చందర్, పోశాల సారంగపాణి, బైరబోయిన రవీందర్, గజ్జేల శ్యామ్, శ్రీరాం రాజేష్, పగడాల సతీష్, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్‌టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వరం సీఎం సహాయ నిధి అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఆరోగ్య పరంగా సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సీఎం సహాయ నిధికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. సీఎం నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఎందరో నిరుపేదల ప్రాణాలను కాపాడుతూ వస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, యువజన పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వంద మంది మహిళలకు చీరల పంపిణీ



కోలాటం బృందం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సమ్మయ్యగౌడ్

కేసముద్రం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో సుమారు రూ.లక్ష విలువైన చీరలను కేసముద్రంలో ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని ఉప్పరపల్లి, అర్పనపల్లి, అమినాపురం గ్రామాలకు చెందిన కోలాటం బృందాల్లోని వంద మంది మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఎర్రంశెట్టి అశోక్, లక్కాకుల సత్యనారాయణ, చాగంటి రాము, మోడెం రాజు, పబ్బతి సారంగపాణి, కట్టన్న, విజేందర్, గంధసిరి వెంకట్, రాజానాయక్ పాల్గొన్నారు.

గుండంపల్లికి బస్సు సర్వీసు ప్రారంభం



గుండంపల్లిలో బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న బిట్ల శ్రీనివాస్

కొత్తగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండంపల్లితో పాటు పలు గ్రామాల ప్రజలు గత కొన్ని రోజులుగా బస్సు సౌకర్యానికి నోచుకోక పోవడంతో మంత్రి సీతక్క కృషితో ఆదివారం బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. గుండంపల్లి, తిమ్మాపురం, మొండ్రాయిగూడెం, మోకాళ్లపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ విషయాన్ని మంత్రి సీతక్క, ఆర్టీసీ డీఎం లక్ష్మి దృష్టికి తీసుకుపోయారు. బిట్ల శ్రీనివాస్ సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు చేయించారు. స్పందించిన మంత్రి సీతక్క, ఆర్టీసీ డీఎం లక్ష్మి ఆదివారం బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. దీంతో గుండంపల్లి గ్రామస్తులు మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డిపో మేనేజర్ లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిట్ల స్వరూప శ్రీనివాస్, గట్టి రమేష్, దానం నారాయణ, లక్కాకుల రాజు, తోట మాధవులు, బిట్ల హరీష్, దానం పద్మ, బిట్ల నాగమ్మ, గట్టి అనసూయ, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నేతలు



కరీంనగర్‌లో కేంద్ర మంత్రి సంజయ్‌ను కలిసిన మానుకోట నేతలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లో మహబూబాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మహబూబాబాద్ జిల్లాలో బీజేపీ బలోపేతం కోసం తనవంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించినట్లు చెప్పారు. ఇందుకు సానుకూలంగా స్పందించి త్వరలోనే మహబూబాబాద్ జిల్లా పర్యటన చేపట్టనున్నట్లు చెప్పారన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్‌గౌడ్, మదన్‌నాయక్, సతీష్, దాసరి మురళి ఉన్నారు.

దుర్గామాత స్వాములకు అన్నదానం

గార్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్రిగూడెం దుర్గా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దుర్గా దేవి మాలలు ధరించిన భవానీలకు, భక్తులకు ఆదివారం దాతల సహకారంతో అన్నదాన వితరణ కార్యక్రమాన్ని గార్ల పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ప్రారంభించారు. అనంతరం దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, ఆలయ పూజారి భూక్యా కాంతారావు, స్వాములు మల్లిబాబు, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలది కష్టపడే జాతి



మహబూబాబాద్‌లో ఆత్మగౌరవ సభకు హాజరైన లంబాడీ ప్రజలు



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

ఆత్మగౌరవ సభలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాల్లో కష్టపడి బతుకుతున్న జాతి లంబాడీలదని రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన లంబాడీల ఆత్మగౌరవ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కూలీలుగా, కార్మికులుగా, కర్షకులుగా పనిచేస్తూ ఈ దేశానికి అన్నం పెడుతున్న లంబాడీ జాతిపై కొందరు విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోయ, గోండు సోదరులు హైకోర్టులో పిటిషన్ వేసిన ఘటన వెనుక రాజకీయ నేతలు, అగ్రవర్ణాల హస్తం ఉందని ఆరోపించారు. ప్రభుత్వం తమ పార్టీలో ఉన్న ఆ సామాజిక వర్గాల నేతలతో సంప్రదించి ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన తెగల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించకుండా శాంతి నెలకొల్పాలన్నారు. లంబాడీలను ఎస్టీజాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌వెనుక కొందరి హస్తం ఉందన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం సమంజసం కాదన్నారు.

మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా లంబాడీల ఓట్లతో గెలిచిన 70 మంది ఎమ్మెల్యేలను ప్రతి తండా, గ్రామాల నుంచి వెళ్లి ఎస్టీ జాబితాలో లంబాడీలను తొలగించాలనే డిమాండ్‌పై ప్రశ్నించాలన్నారు. లంబాడీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులకు పుట్టగతుల్లేకుండా మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. ఈ దేశాన్ని పరిరక్షించిన జాతి లంబాడీలదని, ప్రతి ఉద్యమంలోనూ లంబాడీలకు ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే కుట్రపై లంబాడీలు ఐక్యతగా ఉద్యమించాల్సి ఉందన్నారు. మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ ఫలాలను భవిష్యత్ తరాలకు అందించడానికి, రిజర్వేషన్లను పరిరక్షించుకోవడానికి లంబాడీ జాతి అప్రమత్తంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న కవిత



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

రాజకీయ పార్టీల వైఖరి స్పష్టం చేయాలి..

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే డిమాండ్‌పై రాజకీయ పార్టీల వైఖరిని స్పష్టం చేయాలని ఎల్‌జేఏసీ ఛైర్మన్ జైసింగ్ రాథోడ్, జేఏసీ కన్వీనర్ జాటోత్ కిషన్‌నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆత్మగౌరవ సభలో వారు మాట్లాడుతూ.. లంబాడీ గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని చట్టవ్యతిరేకమైన డిమాండ్ చేస్తున్న కొంతమంది కోయ, గోండు నాయకుల తీరుపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్, మానుకోట జేఏసీ ఛైర్మన్ డాక్టర్ జగదీష్, వైస్ ఛైర్మన్ గుగులోతు కిషన్‌నాయక్, కోకన్వీనర్ బోడ పృథ్వీరాజ్‌నాయక్, మానుకోట మాజీ సర్పంచ్ భూక్య నెహ్రూనాయక్, అర్జున్‌చౌహాన్, భిక్షునాయక్, డాక్టర్ నెహ్రూరాథోడ్, హట్యానాయక్, రాజ్‌కుమార్‌జాదవ్, విద్యార్థి,ప్రజా, కుల, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 29 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు సెలవులు ఉన్నట్లు మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రకటించారు. ఈనెల 29న వ్యాపారస్థులు, గుమస్తాల విజ్ఞప్తి మేరకు సద్దుల బతుకమ్మ సందర్భంగా, 30న మహార్నవమి, అక్టోబరు 1న దుర్గాష్టమి, 2న విజయదశమి, 3న దసరా మరుసటి రోజు ప్రభుత్వ సెలవు, 4, 5 శని, ఆది వారం తప్ప సెలవులు ఉన్నట్లు తెలిపారు. రైతులు గమనించి తమ సరుకులను వచ్చే నెల 6 నుంచి మార్కెట్‌కు తీసుకురావాలని ఆయన కోరారు.

గ్రూప్-1లో మెరిసిన కాంపెల్లి వాసి సాత్విక

182వ ర్యాంకుతో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌గా పోస్టింగ్



సాత్వికకు గ్రూప్-1 ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కురవి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండలం కాంపెల్లి గ్రామానికి చెందిన బీనబోయిన సాత్విక గ్రూప్-1 ఫలితాల్లో మెరిసింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో 182వ ర్యాంకుతో డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని సాధించింది. శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంది. కాంపెల్లి గ్రామానికి చెందిన బీనబోయిన వెంకన్న(లేట్)-శోభ దంపతుల కుమార్తె సాత్విక పదవ తరగతి వరకు ఖమ్మంలో, ఇంటర్మీడియట్ వరంగల్‌లో, ఇంజనీరింగ్ హైదరాబాద్‌లో పూర్తిచేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతోంది. ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ.. ప్రస్తుత ర్యాంకుతో సంతృప్తిగానే ఉన్నానని, తప్పక సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఉన్నత ఉద్యోగాన్ని పొందుతానని ధీమా వ్యక్తం చేసింది.

గ్రూప్-2లో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించిన యువకుడు



భూక్య యాకూబ్

కొత్తగూడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పోలారం గ్రామానికి చెందిన భూక్య యాకూబ్ ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన భూక్య భిక్షం, బిచ్చని దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు యాకూబ్,శ్రీనివాస్, కూతురు గౌషా ఉన్నారు. పెద్ద కుమారుడు భూక్య యాకూబ్ సైతం వ్యవసాయ కూలీ పనులకు వెళుతుంటాడు. యాకూబ్ 1నుంచి 5వ తరగతి వరకు పోలారంలోని ప్రాథమిక పాఠశాలలో, వరంగల్ జిల్లా అశోక్‌నగర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు, నర్సంపేటలోని కాకతీయ కళాశాలలో ఇంటర్ విద్య చదివాడు. నర్సంపేటలోని సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ, పీజీ చదువుకున్నాడు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా హైదరాబాద్ చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీలో స్వతహాగా చదువుకుని గత డిసెంబరు 15, 16న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-2లో ఎస్టీ కేటగిరిలో 27, ఓపెన్ కేటగిరిలో 752 ర్యాంకు సాధించి ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. కాగా, నవంబరు 17, 18 జరిగిన గ్రూప్-3లో సైతం ఎస్టీ కేటగిరిలో 08, ఓపెన్ కేటగిరిలో 644 ర్యాంకు సాధించాడు. ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించిన యాకూబ్‌ను పోలారం గ్రామస్థుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, వేలుబెల్లి మాజీ సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్‌తో పాటు పలువురు అభినందించారు.

గ్రూప్-2లో మెరిసిన పంచాయతీ కార్యదర్శి నరేందర్

● రాష్ట్ర స్థాయిలో 201వ ర్యాంకు



మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం సండ్రాలగూడెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కొమ్మనబోయిన నరేందర్ రాష్ట్ర స్థాయిలో 201వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకు సాధించిన నరేందర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించారు. కొత్తగూడ మండలం పొగుళ్లపల్లికి చెందిన కొమ్మనబోయిన సాంబయ్య-మంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నరేందర్ పంచాయతీ కార్యదర్శిగా, చిన్నకుమారుడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎండి ఫిజీషియన్‌గా విద్యనభ్యసిస్తున్నారు. నరేందర్ 1 నుంచి 10వ తరగతి వరకు పొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ హనుమకొండలోని ప్రైవేటు కళాశాలలో విద్యనభ్యసించారు. 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించారు.

నేడు సద్దుల సంబురం

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 21న మహాలయ అమావాస్యతో ప్రారంభమైన ఎంగిలిపూల బతుకమ్మ ఈనెల 29న సద్దుల బతుకమ్మతో ముగియనుంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణాలు, గ్రామాల్లో ఎనిమిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించగా, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకునేందుకు గ్రామాల్లోని చెరువుల వద్ద స్వచ్ఛందంగా ప్రజలు, యువకులు లైట్లను ఏర్పాటు చేసి మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.



మహబూబాబాద్‌లో పూలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో..

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. స్టేడియంలో హైమాస్ట్ లైట్లను అమర్చారు. మైదానంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు అధికారులు నీటి తొట్టిలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు స్టేడియం సమీపంలోని నిజాం చెరువులో బతుకమ్మలను మునిసిపల్ సిబ్బంది నిమజ్జనం చేయనున్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సద్దుల వేడుకలను నిర్వహించి బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. అక్కడ అధికారులు ఏర్పాట్లు చేశారు. తొర్రూరు పెద్ద చెరువు వద్ద బతుకమ్మ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మరిపెడ కొండసముద్రం చెరువులో నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కురవి పెద్ద చెరువు వద్ద సద్దుల బతుకమ్మ పర్వదిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లా కేంద్రంలో భారీగా పూల కొనుగోళ్లు

సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పలు రకాల పువ్వుల కొనుగోళ్లు భారీగా జరిగాయి. చివరిరోజు సద్దులబతుకమ్మను పెద్దగా పేర్చేందుకు మహిళలు పోటీ పడి కొనుగోలు చేశారు. స్థానిక నెహ్రూ సెంటర్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు వ్యాపారులు పూలను విక్రయించగా ఆ ప్రాంతమంతా జనంతో సందడిగా మారింది. బంతి, చామంతి పూలు, గునుగు పూలు, తంగెడు పువ్వును కొనుగోలు చేశారు. సద్దుల బతుకమ్మ పండుగ కోసం మెట్టినింటి నుంచి పుట్టినింటికి మహిళలు చేరుకోగా ఇళ్లన్నీ సందడిగా మారాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

'సద్దుల బతుకమ్మ'పై గందరగోళం

● నేడు సద్దుల బతుకమ్మ : ఉత్సవ కమిటీ ప్రకటన

● 30న జరుపుకోవాలని కమిషనర్ ఉత్తర్వులు

కేసముద్రం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మునిసిపాలిటీలో సద్దుల బతుకమ్మ పండుగ ఏ రోజు అనే అంశంపై గందరగోళం నెలకొంది. బతుకమ్మ ప్రారంభమైన నాటి నుంచి తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ నిర్వహించడం సంప్రదాయమని తెలుపుతూ సోమవారమే సద్దుల బతుకమ్మ అని దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు అల్లం నాగేశ్వర్‌రావు, జాటోత్ హరీష్‌నాయక్ ప్రకటించారు. అంతేకాకుండా మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ వీడియో సందేశాన్ని కూడా సోమవారమే జరుపుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా సాయంత్రం కేసముద్రం మునిసిపాలిటీ కమిషనర్ ఈనెల 30న సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని ప్రభుత్వ ఆదేశాల జీవోను పేర్కొంటూ ఉత్తర్వులను జారీ చేయడంతో గందరగోళం నెలకొంది. మరోవైపు ఇదే కమిషనర్ మహబూబాబాద్ మునిసిపాలిటీలో ఉదయం ఈనెల 29నే జరుపుకోవాలని, ఆ తర్వాత 30నే సద్దుల బతుకమ్మ అని ఉత్తర్వులు విడుదల చేయడంతో గందరగోళం నెలకొంది. ఏదేమైనా ఈనెల 30న ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ కేసముద్రం మునిసిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 29న సద్దుల బతుకమ్మ నిర్వహిస్తుండడం గమనార్హం.



కేసముద్రం పెద్దాయిచెరువు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ బాధ్యులు

సీపీఐ సీనియర్ నేత రంగయ్య మృతి

● పాడె మోసిన జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి

● నెల రోజుల క్రితం భార్య మృతి.. తీవ్ర విషాదం

బయ్యారం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, మండల మాజీ కార్యదర్శి పుసులూరి రంగయ్య (75) అనారోగ్యంతో శనివారం రాత్రి బయ్యారంలోని స్వగృహంలో మృతి చెందారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి రంగయ్య భౌతికకాయాన్ని ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం విజయ్‌సారథి మాట్లాడుతూ రంగయ్య మరణం పార్టీకి తీరని లోటన్నారు. ముఖ్యంగా బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపన ఉద్యమంలో రంగయ్య కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. వివాదరహితుడిగా అన్ని వర్గాల మన్ననలు పొందిన రంగయ్య ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజయ్‌సారథి, నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, చంద్రన్న, జగన్న, సారయ్య, పద్మ, కళింగరెడ్డి, నాగేశ్వరరావు, రమేష్, భిక్షం, రాజన్న, లక్ష్మి, వెంకన్నతోపాటు వివిధ పార్టీల నేతలు, గ్రామస్థులు రంగయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా, రంగయ్య భార్య భద్రమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. నెల రోజుల వ్యవధిలోనే దంపతులు మృతి చెందడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

భగత్‌సింగ్ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థుల హక్కుల కోసం పోరాడాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ పిలుపునిచ్చారు. ఆదివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని మహబూబాబాద్‌లో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత హక్కుల కోసం పోరాడాలన్నారు. చిన్నతనంలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యువ కిషోరం భగత్ సింగ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాంతికుమార్, వీరభద్రం, సాయికుమార్, సూర్యప్రకాష్, శ్రీకాంత్, వంశీ, శివవర్మ, దేవేందర్, దిలీప్, జవహర్‌లాల్, రమేష్, కిరణ్, యుగందర్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

దేశ స్వాతంత్ర్యం కోసం అతిచిన్న వయసులోనే ఉరి కంబాన్ని ఎక్కిన భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో నేటి యువత శాస్త్రీయమైన విద్య కోసం ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు అన్నారు. మహబూబాబాద్‌లో భగత్‌సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పవన్, రాకేష్, వీరేందర్, వంశీ, అనిల్, రవితేజ, వరుణ్, నరేష్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జలగం ప్రవీణ్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్‌లో భగత్ సింగ్ విగ్రహానికి ఆయా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తన ప్రాణాలు అర్పించిన గొప్ప అధ్యయన వేత్త, విప్లవకారుడు భగత్‌సింగ్ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి 23 సంవత్సరాలకే ఉరికంబం ఎక్కిన గొప్ప నాయకుడు భగత్‌సింగ్ అని, ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. నాయకులు అశోక్, వెంకటేష్, సాయి, నాగేంద్రబాబు,వినయ్,వేణు, భరత్‌కుమార్,ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థి, ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

కురవి(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు విద్యారంగ సమస్యలపై, ప్రజా సమస్యలపై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ కురవి మండల కార్యదర్శి కొలిపాక వీరేందర్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నందిని, హర్షిత, వీరన్న, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.





కురవిలో భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న వీరేందర్